RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | బుధవారం, జూన్ 10, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 52 | పేజీలు: 8 | వెల : రూ.1



## హైదరాబాద్‌లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

# రాష్ట్ర అభివృద్ధే లక్ష్యం.. వచ్చే రెండున్నరేళ్లు తెలంగాణ వికాసం కోసం నిరంతర కృషి: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 10 (వాయిస్ టుడే): రాష్ట్ర అభివృద్ధే ఎజెండాగా లక్ష్యాలను చేరుకోవడానికి వచ్చే రెండున్నరేళ్లు నిరంతరం తెలంగాణ వికాసం కోసం పనిచేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధికి బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవనంతో పాటు మొత్తం రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం మియాపూర్ క్రాస్ రోడ్స్‌లో నిర్వహించిన సభలో సీఎం ప్రసంగించారు. మల్కాజిగిరి పరిధిలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. వచ్చే మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో భాగంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, తెలంగాణ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్), రేడియల్ రోడ్ల నిర్మాణం వంటి కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాయదుర్గం నుంచి నియోపోలిస్ వరకు మెట్రో విస్తరణ చేపడతామని వెల్లడించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలంటే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరమని పేర్కొన్న సీఎం, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనాలను ఆధునిక సదుపాయాలతో నిర్మిస్తామని తెలిపారు. నగరంలో పేదలకు గృహాల అవసరం ఉందని గుర్తుచేస్తూ, లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే గృహాలు నిర్మించి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు కాలుష్యం, ట్రాఫిక్, వరదల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్న సీఎం, అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో తలెత్తకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఓఆర్ఆర్ పరిధిలో 1.34 కోట్ల జనాభా నివసిస్తోందని, నగరం ప్రతి ఏడాది మూడు శాతం చొప్పున విస్తరిస్తోందన్నారు. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2,100 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ప్రాంతాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామని తెలిపారు. 150 డివిజన్లతో గ్రేటర్ హైదరాబాద్, 76 డివిజన్లతో సైబరాబాద్, 74 డివిజన్లతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటికి అనుగుణంగా పోలీస్ కమిషనరేట్లను కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అభివృద్ధి విషయంలో రాజకీయ వివక్షకు తావు లేదని స్పష్టం చేసిన సీఎం, ఎన్నికల సమయంలో రాజకీయాలు మాట్లాడుకోవచ్చని, అప్పటి వరకు అన్ని రాజకీయ పక్షాలు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# లక్ష డాలర్ల ఫీజు.. తలబొప్పి కట్టింది



న్యూఢిల్లీ,జూన్ 8, (వాయిస్‌టుడే) : దెబ్బ మీద దెబ్బ.. ఇది మామూలు దిబ్బ కాదు. ట్రంప్ దిమ్మ తిరిగిపోయే దెబ్బ. కాళ్ళ కింద భూమి కంపించి పోయే దెబ్బ. ఇక జన్మలో ఆ మాట కూడా ఎత్తడానికి కూడా భయపడే దెబ్బ.. అమెరికాలో ఏకచత్రాధిపత్యంగా.. మూర్ఖుడి మాదిరిగా నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్ కు అక్కడి కోర్టు తిరుగులేని తీర్పు ఇచ్చింది. ఇకపై జన్మలో ఆ ఊసు ఎత్తడానికి కూడా వణుకు పుట్టేలా చేసింది.ట్రంప్ తన పరిపాలన నిర్లక్ష్యాన్ని ప్రపంచ మీద రుద్దడానికి రకరకాల విన్యాసాలకు పాల్పడుతున్నాడు. ప్రపంచ దేశాల మీద అనవసరమైన సుంకాలు విధించడం.. ఇంకా లేనిపోని షరతులు విధించడం.. యుద్ధాలు చేయడం.. ఇలాంటి ఎన్నో దారుణాలకు పాల్పడుతున్నాడు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే. ట్రంప్ తీసుకున్న మరో దారుణమైన నిర్ణయం అమెరికా కంపెనీలకు కోలుకోలేని ఇబ్బందిగా మారింది. అమెరికా యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశం లో భాగంగా.. అమెరికన్ కంపెనీల పై ట్రంప్ ప్రత్యేకమైన రుసుము వసూలు చేస్తామని ప్రకటించారు.. ప్రత్యేకమైన నైపుణ్యాల కోసం విదేశీ కార్మికులను నియమించుకునే యాజమాన్యాలు లక్ష డాలర్లు రుసుము చెల్లించాలని ట్రంప్ ఒక పనికిమాలిన విధానాన్ని తెరపైకి తీసుకొచ్చాడు. దీనిపై నిరసనలు వ్యక్తమయ్యాయి.ట్రంప్ తీసుకొని నిర్ణయం పట్ల అమెరికా కాంగ్రెస్ కూడా ఆమోదం తెలపలేదు. దీనిని చట్ట విరుద్ధమైన పన్ను అని బోస్టన్ ఫెడరల్ కోర్టు అభిప్రాయపడింది. విదేశాల నుంచి వచ్చే వృత్తి నిపుణులకు హెచ్ 1 బీ వీసాలు ఇవ్వడానికి లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని కోర్టు మండిపడింది.ట్రంప్ తీసుకున్న నిర్ణయం చల్లదని యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియోసోరోకిన్ అత్యంత చారిత్రాత్మకమైన తీర్పు చెప్పారు.. గత ఏడాది సెప్టెంబర్ లో ట్రంప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాలలో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా ఆయన

(మిగతా 2వ పేజీలో)

## మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూన్ 10 (వాయిస్ టుడే): ఈ నెల 16న నిర్వహించనున్న మొహర్రం ఊరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలా ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీతో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన

(మిగతా 2వ పేజీలో)




## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తాం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


న్యూఢిల్లీ, జూన్ 10 (వాయిస్ టుడే): దళిత క్రైస్తవులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదా కల్పించే వరకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) మార్గదర్శకత్వంలో ఉద్యమం కొనసాగిస్తామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్ సాగర్ తదితరులతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ కే.జీ. బాలకృష్ణన్‌ను కలిసింది. అనంతరం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, 1950లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాల్సిన అవసరం ఉందన్నారు. దళిత క్రైస్తవులను బీసీ-సీ కేటగిరీలో కొనసాగించడం అన్యాయమని, వారిని ఎస్సీలుగా గుర్తించాలని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని కూడా జస్టిస్ బాలకృష్ణన్‌కు వివరించామని చెప్పారు. తమ వినతిని కమిషన్ చైర్మన్ సావధానంగా విన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో దళితులతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి విశేష కృషి జరిగిందని, దళితబంధు వంటి పథకాల ద్వారా ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చారని రవిచంద్ర తెలిపారు. మహిళలు, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానించి కేంద్రానికి సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు తెలంగాణ ప్రయోజనాల కోసం సమర్థవంతంగా పోరాడటం లేదని ఆయన విమర్శించారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే బీఆర్ఎస్ డిమాండ్ న్యాయమైనదని, ఇది కేవలం తెలంగాణకే పరిమితమైన అంశం కాదని, దేశవ్యాప్తంగా ఉన్న దళిత క్రైస్తవుల హక్కులకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహింసా మార్గంలో పోరాడినట్లే, దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా కోసం కూడా పార్లమెంట్ లోపల, బయట పోరాటం కొనసాగిస్తామని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు.

## నీటిపారుదల భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 10 (వాయిస్ టుడే): రాష్ట్ర నీటిపారుదల శాఖకు చెందిన అందుబాటులో ఉన్న భూములు, జలాశయాలు, కాలువ వ్యవస్థలను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే దిశగా కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జలసౌధలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల శాఖ కేవలం ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణకే పరిమితం కాకుండా స్వంత విద్యుత్ వనరులను సృష్టించుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ముఖ్యంగా శాఖకు చెందిన భూములు, కాలువలపై సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలు, ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల నిర్వహణకు భారీ స్థాయిలో విద్యుత్ వ్యయం జరుగుతోందని పేర్కొన్న మంత్రి, దీర్ఘకాలికంగా వ్యయాన్ని తగ్గించేందుకు సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైతే నిపుణ సంస్థల సహకారంతో సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సమర్పించిన ప్రజెంటేషన్ ప్రకారం రాష్ట్రంలోని 16 జలాశయాల వద్ద సాధ్యతా అధ్యయనాలు నిర్వహించగా, అనుకూలమైన జలాశయాలు, నీటిపారుదల భూముల్లో కేవలం 10 శాతం విస్తీర్ణాన్ని వినియోగించినా 6,000 నుంచి 7,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సృష్టించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మంజీరా, సింగూరు జలాశయాల్లో ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. జాగోరా-చందోరా మధ్య 15 కిలోమీటర్ల కాలువపై ప్రతిపాదించిన 20 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన దీూు నమూనా సౌర విద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 340 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా రూ.11.5 కోట్ల ఆదాయం సమకూరడంతో పాటు విద్యుత్ కొనుగోలు వ్యయంలో రూ.6.2 కోట్ల వరకు ఆదా అవుతుందని, 25 సంవత్సరాల కాలంలో సుమారు రూ.155 కోట్ల పొదుపు సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని పునరుత్పాదక ఇంధన వినియోగంలో దేశానికి ఆదర్శంగా నిలిపేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# 10,11 తేదీల్లో ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి



## ఎన్డీఏ, నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొననున్న సీఎం

అమరావతి, జూన్ 9: వాయిస్ టుడే : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనుకు ఢిల్లీ వెళుతున్నారు. జూన్ 10, 11వ తేదీల్లో సీఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరవుతారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. 11వ తేదీ గురువారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు అమరావతి చేరుకుంటారు

వాయిస్ ఆఫ్ ప్రజలు

బుధవారం, జూన్ 10, 2026

# మేము 18 గంటలు కష్టపడుతుంటే.. హరీష్‌రావు అబద్ధాలు చెబుతున్నారు: భట్టి విక్రమార్క

**రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోందన్న భట్టి**

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు**

**తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి**

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ



ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం... పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

**తెలంగాణకు రెండ్రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ**

**ఈదురుగాలులకు కూలిన చెట్లు, నిలిచిన విద్యుత్ సరఫరా**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**



నైరుతి రుతుపవనాల ఆగమనానికి ముందే తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తగా, రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రానున్న రెండు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం కూడా వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ఇదే తరహా వాతావరణం కొనసాగనుంది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఈ వర్షాలు కురుస్తున్నాయి. ఇవి వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**హైదరాబాద్‌లో భారీ వర్షం**

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న భాగ్యనగరవాసులకు మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షం ఉపశమనం కలిగించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, హైటెక్ సిటీ, చందానగర్, ముషీరాబాద్, లక్డీకాపూల్, సరూర్‌నగర్, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బాగ్ లింగంపల్లి, రాంనగర్ సహా అనేక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ధాటికి రాంనగర్ వీఎస్టీ రోడ్డు, హైదర్‌గూడ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముషీరాబాద్‌తో పాటు నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# అందుబాటులోకి భోగాపురం ఎయిర్‌పోర్ట్

శ్రీకాకుళం, జూన్ 9, (వాయిస్ టుడే ) : మరో నెల రోజుల్లో ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారం కానుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించ బడునుంది. ఎప్పటికీ ప్రైవేటు ఎయిర్లైన్స్ తమ సర్వీసులను భోగాపురం నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నాయి. దాదాపు ప్రపంచ ప్రఖ్యాత ప్రైవేట్ ఎయిర్లైన్స్ తమ సర్వీస్ లను నడపనున్నాయి. కానీ విశాఖ తో పాటు నగరం అనుసంధానంగా ఉండే ప్రాంతాల నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు ప్రయాణ భారం కానుంది. అంతర్గత రహదారులు ఉన్నా.. ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తేనే రవాణా ఇబ్బందులు తొలుగుతాయి. లేకుంటే చాలా ఇబ్బందికరమే. 50 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో రవాణాకు రెండు గంటల సమయం పట్టే అవకాశం ఉంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు మూడు నుంచి నాలుగు మార్గాలు ఉన్నాయి. అయితే ట్రాఫిక్ సమస్య దృష్టిలో ఏ మార్గంలో వెళ్లిన గంటన్నరకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. దీనిపై అధికార యంత్రాంగం కూడా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. విశాఖ నగరం నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు ప్రధానంగా హనుమంతవాక, ఎండాడ, పీఎం పాలెం, మధురవాడ, కొమ్మాది, మారికవలస, అనంతపురం మీదుగా భోగాపురం వెళ్లాలంటే కచ్చితంగా 1.50 గంటల సమయం పట్టనుంది.అనకాపల్లి నుంచి భోగాపురం చేరుకోవాలంటే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. గంటన్నరలోగా చేరుకోవచ్చు. దానికి కారణం జాతీయ రహదారి ఉండడమే. 16వ నెంబర్ జాతీయ రహదారి ఉంది. అనకాపల్లి నుంచి ఎన్ హెచ్ 16 బైపాస్ మీదుగా ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చు.. స్టీల్ ప్లాంట్ నుంచి బయలుదేరాలి అనుకుంటే.. విశాఖ నగరానికి టచ్ చేయకుండా లంకెలపాలెం, సబ్బవరం మీదుగా ఎన్హెచ్ 16 ఎక్కి ఆనందపురం నుంచి భోగాపురం వెళ్లడానికి 1. 40 గంటల సమయం పడుతుంది. గాజువాక నుంచి కూడా అంతే.. విశాఖ నగరవాసులు భీమిలి



మీదుగా చేరుకోవాలి అనుకున్నా గంటన్నర సమయం పడుతుంది హనుమంతువాక నుంచి అడవివరం, ఆనందపురం మీదుగా భోగాపురానికి 1.40 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. అయితేభో గాపురం ఎయిర్పోర్ట్ కు ప్రత్యేకంగా రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కఠిన ఆంక్షలు అమలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే వీఎంఆర్డీఏ ఏడు రహదారులను ప్రతిపాదించింది. వాటిని అందుబాటులోకి తెస్తే కానీ.. భోగాపురం ఎయిర్పోర్ట్ కు ప్రయాణభారం తప్పదు.

# 2029 కోసం జనబంధన్ అడుగులు

న్యూఢిల్లీ,జూన్ 8, (వాయిస్ టుడే ) : దేశ రాజధాని న్యూ ఢిల్లీ వేదికగా ప్రతిపక్ష ఇండియా కూటమి రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు, 2029 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలనే దానిపై వ్యూహాలను సిద్ధం చేయడానికి ఈ భేటీని ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరగనున్న ఈ ఇండియా జనబంధన్ సమావేశానికి మొత్తం 23 ప్రతిపక్ష పార్టీలు హాజరవుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేలతో పాటు పలు లెఫ్ట్ పార్టీలు, చిన్న పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బలమైన ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ (పశ్చిమ బెంగాల్), డీఎంకే (తమిళనాడు) పరాజయం పాలవడంతో కూటమిలో సమీకరణాలు మారాయి. ముఖ్యంగా బెంగాల్‌లో తమ నేతలపై జరుగుతున్న దాడుల అంశాన్ని టీఎంసీ ఇక్కడ లేవనెత్తనుంది. అలాగే కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్–బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందంటూ వచ్చిన ఆరోపణలపై సీపీఐ(ఎం) పార్టీ కాంగ్రెస్ నాయకత్వాన్ని వివరణ కోరనుంది.కూటమిలో భిన్నత్వంలో ఏకత్వం ఉందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పేర్కొన్నప్పటికీ, కొన్ని కీలక పార్టీలు ఈ భేటీకి దూరం కావడం




గమనార్హం. ఈ ప్రతిపక్షాల ఐక్యతా రాగానికి గండి కొడుతూ అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ, తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకే ప్రభుత్వంలో చేరడంతో డీఎంకే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని నిర్ణయించింది. అయితే నిన్ననే మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు కేజ్రీవాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపినట్టుగా సమాచారం. కొన్ని పార్టీలు వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోతున్నప్పటికీ, మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశాయి. ఈ ప్రతిపక్షాల భేటీపై అధికార బీజేపీ తీవ్రంగా మండిపడింది. కూటమిలోని అంతర్గత లేఖలను ప్రస్తావిస్తూ బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమికి ఎలాంటి మిషన్ (లక్ష్యం), విజన్ లేవని వారిలో ఉన్నదల్లా కేవలం కన్ఫ్యూజన్, డివిజన్, పరస్పర ఆరోపణలు, పదవుల కోసం ఆరాటం మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఏదేమైనప్పటికీ, దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి జాతీయ అంశాలపై ఉమ్మడి ముఖచిత్రాన్ని ప్రదర్శించేందుకు ప్రతిపక్షాలుఈ వేదికను వాడుకోనున్నాయి.

## లక్ష డాలర్ల ఫీజు.. తలబొప్పి కట్టింది

హెచ్1బికి ఎంపికైన వారు లక్ష డాలర్ల ఫీల్ చెల్లించాలని ఒక విధానాన్ని తెరపైకి తీసుకువచ్చింది. దీనిని దాదాపు 20 రాష్ట్రాల అటార్నీ జనరల్ తీవ్రంగా తప్పుపట్టారు. అదే కాదు పోస్ట్ అని కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని జడ్జి విచారించారు. లక్ష డాలర్ల ఫీజు వసూలు చేయడం ఏంటని మండిపడ్డారు..అది పెనాల్టీ ఎలా అవుతుంది. అలా తీసుకోవడానికి మీరెవరు. అటువంటి విధానం అమెరికన్ కాంగ్రెస్ ఆమోదం లేకుండా ఎలా సాధ్యమవుతుంది. అమెరికా అధ్యక్షుడు ఇటువంటి నిర్ణయం ఎలా తీసుకుంటారని"కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. "కళాశాలలు.. ఆస్పత్రులు.. వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగులను నియమించుకోవడానికి మా సామర్థ్యానికి మించి లక్ష డాలర్ల రుసుము చెల్లించాలంటే ఇబ్బందిగా ఉండేదని" ఆయా రాష్ట్రాలకు చెందిన అటార్నీ జనరల్స్ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును కోర్టు తీవ్రంగా పరిగణించి.. ట్రంప్ ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. ఇక జన్మలో లక్ష డాలర్ల రుసుము వసూలు చేయాలనే ఆలోచన ట్రంప్ మదిలో ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు.

## మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు: మంత్రి పొన్నం ప్రభాకర్

సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మొహర్రం సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆశూర్‌ఖానాల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పరిసర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే హైమాస్ట్ లైట్లు, ప్రత్యేక విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, మొబైల్ టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలకు సూచించారు. ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించిన మంత్రి, ప్రధాన ఊరేగింపు ప్రారంభమయ్యే బీబీ–కా–ఆలం ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఆశూర్‌ఖానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్సులు కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషీ, ఎమ్మెల్యేలు మీర్ జుల్ఫేకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు చైర్మన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు సీఈఓ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి: రాంచందర్ రావు

**ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య**

**కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు––రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.



## స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై విచారణకు బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు ::: ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం. క్షతగాత్రులకు రూ. 10 లక్షల పరిహారం, చికిత్సకి అయ్యే ఖర్చు మొత్తం ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుంది. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం నాడు విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనా స్థలిని సందర్శించిన తరువాత అయన మీడియాతో మాట్లాడారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు. కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షల అందుతాయి. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లల మాదిరి మృతుల పిల్లల చదువులు కొనసాగించేందుకు సహకారం అందిస్తామని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై విచారణకు బొకారో స్టీల్ ప్లాంట్ నుంచి త్రీ మ్యాన్ కమిటీ ఏర్పాటు. విచారణ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి సహకారం అందిస్తాం. స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలు, యాజమాన్య లోపాలు, సాంకే తికపరమైన ఇబ్బందులు తెలుసుకునేందుకు త్వరలో కార్మిక సంఘాలతో సమావేశం అవుతామని అన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు.. స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరగకూడదన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని పవన్ కళ్యాణ్ అన్నారు.





# పటేల్ జాగృతి సేవా సంస్థ కార్యక్రమంలో

# కాపు సమాజ ఐక్యతకు పిలుపు

ముంబై, జూన్ 7: (వాయిస్ టుడే) : పటేల్ జాగృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో "సద్భావనా మిలన్, వైచారిక సదస్సు మరియు చర్చా కార్యక్రమం" ముంబైలోని మాటుంగా ప్రాంతంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. సమాజంలో సౌహార్దం, సామాజిక చైతన్యం, భావజాల పరమైన చర్చలు మరియు ప్రజా సంక్షేమ అంశాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఐఏఎస్ అధికారి సి.జె. పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, రవీంద్ర వర్మా (జీఎం ఎలక్ట్రికల్, ఏఆర్వీసీ ముంబై), డి.ఎన్. వర్మా (హర్బల్ ఎగుమతిదారు) విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని సమాజ అభివృద్ధి, యువత పాత్ర, సేవా కార్యక్రమాల ప్రాధాన్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా అఖిల భారతీయ కాపు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, కాపు, మున్నూరు కాపు, కుర్మీ, పటేల్ తదితర సమాజాలు చారిత్రాత్మకంగా ఒకే మూలాలతో అనుబంధం కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాలు వేర్వేరైనా సమాజ అభ్యున్నతి, యువత భవిష్యత్తు, విద్యా మరియు ఆర్థిక పురోగతి లక్ష్యాలు ఒకటేనని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కాపు సమాజ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంతో పాటు విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు సంఘాలు ముందుకు రావాలని సూచించారు. సమాజంలో సేవా భావం, ఐక్యత, పరస్పర గౌరవం పెరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాయిస్ టుడే ఎండీ కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ, నిజాం హైదరాబాద్ రాష్ట్ర కాలంలో మనమంతా ఒకే సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో జీవించామని గుర్తు చేశారు. నేడు రాష్ట్రాలు వేర్వేరైనా మన మూలాలు, భాష, ఆచారాలు, సంప్రదాయాలు ఒకటేనని పేర్కొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో నివసిస్తున్న కాపు సమాజం పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలోని యువత విద్య, ఉపాధి, వ్యాపార రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సంఘాలు వేదికలుగా మారాలని సూచించారు. సమాజ సేవ, సాంస్కృతిక పరిరక్షణ, పరస్పర సహకారంతోనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో పటేల్ జాగృతి సేవా సంస్థ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కాపు సమాజ ప్రముఖులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## టీ - సేవ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం



హైదరాబాద్, జూన్ 09: టీ - సేవ ఆన్ లైన్ స్కిల్ కేంద్రాల ఏర్పాటుకై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ, మండల, మున్సిపాలిటీ, జిల్లా, సిటీ నుండి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీ -సేవ సెంటర్ డైరెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపారు. క్రొత్త పాన్ కార్డులు అప్లై, కరెక్షన్ చేయవచ్చు, బస్సు, ట్రైన్, విమాన టికెట్స్ బుకింగ్స్, బ్యాంకు మనీ ట్రాన్స్ ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు, కాష్ డిపోసిట్స్, హెల్త్, బైక్ ఉ కార్ ఇన్సూరెన్స్, బిల్లుల చెల్లింపులు, 1000 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణా తరగతుల కు నమోదు కేంద్రం , 500 కి పైగా కేంద్రప్రభుత్వ సంస్థ ఆమోదిత స్కిల్ టెస్ట్ సర్టిఫికేషన్ కొరకు నమోదు కేంద్రం , టీ – సేవ ప్రతి సంవత్సరం టీ – సేవ ఆన్‌లైన్ స్కిల్ కేంద్రాల ద్వారా 15 లక్షలకు పైగా విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు 1000కి పైగా ఉపాధి అవకాశాలు గల స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించనుంది. ఆన్ లైన్ సేవలు వినియోగదారులకు

అందించడంతో పాటు ఆన్లైన్ లో వివిధ సేవలను అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందే వీలుంది. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్: www.tsevaonline.com ఫోన్: 8179955744.



## బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం ముమ్మాటికి బిఆర్ఎస్ ఘనతనే

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

కుత్బుల్లాపూర్ జూన్ 9(వాయిస్ టుడే) : బిఆర్ఎస్ ప్రభుత్వహయాంలో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదు. సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్ ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఎండ గట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. బాచుపల్లి ఫ్లేవర్ నిర్మాణంతోపాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుంది. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది.ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్. ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే.

ఎస్ ఎన్ డి పి, ఎస్ ఆర్ డి పి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ – సిటి అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు సుచిత్ర – కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేకపోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీని ప్రచారం చేస్తూ ఉన్న నగరాన్ని విస్మరిస్తున్నారు ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రం తో పాటు హైదరాబాద్ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీయే రక్ష.



## వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

కుత్బుల్లాపూర్ జోన్ 09(వాయిస్ టుడే): జీడిమెట్ల 132వ డివిజన్ పరిధిలో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా రహదారులపై ఉన్న గుంతలను పూడ్చి ప్యాచ్ వర్క్ చేపట్టాలని నేను ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ వినతిపత్రం అందజేశాను. నా విజ్ఞప్తికి వెంటనే స్పందించిన డీసీ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించి పనులను ప్రారంభింపజేయడం అభినందనీయం. జీడిమెట్ల 132వ డివిజన్ ప్రజల తరఫున డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. ప్రజా సమస్యల పరిష్కారమే నా లక్ష్యం... ప్రజల కోసం నా పోరాటం నిరంతరం కొనసాగుతుంది.

## ముంబైలో అఖిల భారతీయ కాపు ఐక్యవేదిక నూతన కమిటీ నియామకం



ముంబై, జూన్ 10 (వాయిస్ టుడే): మహారాష్ట్ర రాష్ట్రంలోని ముంబై నగరంలో తెలుగు మరాఠా మున్నూర్వారు పటేల్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అఖిల భారతీయ కాపు ఐక్యవేదిక నూతన కార్యవర్గాన్ని నియమించారు. అఖిల భారతీయ కాపు ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహారాష్ట్ర--ముంబై అధ్యక్షుడిగా కుంట మల్లేష్ పటేల్ (రిటైర్డ్ బీఎంసీ ఇంజనీర్), ప్రధాన కార్యదర్శిగా సంగినేని రవీంద్ర పటేల్, ఉపాధ్యక్షుడిగా ఆకుల శంకర్ పటేల్‌లను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కాపు, మున్నూరు కాపు, పటేల్ సమాజాల ఐక్యత, సామాజిక అభివృద్ధి, యువతకు విద్యా మరియు ఉపాధి అవకాశాల కల్పన కోసం అఖిల భారతీయ కాపు ఐక్యవేదిక కృషి చేస్తోందన్నారు. మహారాష్ట్రలో నివసిస్తున్న తెలుగు మున్నూరు కాపు కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా ఎదిగేలా నూతన కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ, సమాజ అభ్యున్నతికి సంఘాలు కీలక పాత్ర పోషించాలని, యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముంబై తెలుగు అసోసియేషన్, మున్నూరు కాపు సంఘం నాయకులు సకెల్లి రాములు పటేల్, డాక్టర్ పి.ఎల్.ఎన్. పటేల్, భేతి శ్రీధర్ పటేల్, కాపు--పటేల్ సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజ ఐక్యత, సేవా కార్యక్రమాల విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.



## ఈతను పాఠ్యాంశంలో చేర్చేందుకు మంత్రి హామీ

### -- రవీందర్ ముదిరాజ్ పోరాటానికి గుర్తింపు

కుత్బుల్లాపూర్ జూన్ 9(వాయిస్ టుడే ) ఈ సందర్భంగా ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటన చేసినందుకు,మంత్రి కర్రతో చేసిన చేప బొమ్మను ఇస్తూశాలువాతో సన్మానించడం జరిగింది, నా పోరాటం పాఠ్యాంశంలో చేర్చాలని 25 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలకు విన్నవించినాను,అతను స్పందిస్తూ ఇది తప్పనిసరిగా క్యాబినెట్ మీటింగ్ లో పెట్టి ముఖ్యమంత్రితో చర్చించి పాఠ్యఅంశంలో చేర్చే విధంగా చేస్తానని,ఆ వెంటనే సంబంధిత అధికారులకు క్రీడా శాఖ వారికి, విద్యాశాఖ వారికి,ఫోనులో మాట్లాడి ఈ ఒక సబ్జెక్టును జరగబోయే క్యాబినెట్ మీటింగ్ లో అందివ్వాలని,సంబంధిత అధికారులకు,ఆర్డర్ ఇవ్వడం జరిగింది,పాఠ్య అంశంలో చేర్చడానికిహామీ ఇస్తున్నాను మొన్ననే మా నియోజకవర్గంలోని నలుగురు పిల్లలు ఈత,రాక,సాధన అని తెలియక,చనిపోవడం జరిగింది, తమరు, రవీందర్ ముదిరాజ్ చేస్తున్నటువంటి ఈ యొక్క పోరాటాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను తమరు, సేకరిస్తున్నటువంటి ఈ యొక్క డాటాను నేను, చూసి అభినందిస్తున్నాను అని నన్ను షాలువతో సన్మానించారు,నీవద్ద ఇంకేదైనా సమాచారం, ఉంటే నాకు అందించవలసిందిగా తెలియజేయడం జరిగింది, యొక్క కార్యక్రమంలో బాచుపల్లి మాజీ కార్పొరేటర్,సర్పంచ్ ఆగం పాండు, రాబోలు,జితేందర్, రాజేష్ మొదలగువారు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.





# చేపల మందు పంపిణీలో బజరంగ్ సేన

హైదరాబాద్, జూన్ 09: హైదరాబాద్ లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బతిని గౌడ్ కుటుంబం నిర్వహించిన వార్షిక చేపల మందు పంపిణీ కార్యక్రమంలో బజరంగ్ సేన తెలంగాణ ప్రతినిధులు పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ రావు, నగర అధ్యక్షుడు మనోజ్ మొగల్గిద్ది పాల్గొని దేశవ్యాప్తంగా వచ్చిన రోగులకు స్వయంగా సాంప్రదాయ చేపల మందును అందించారు. ఆతిథ్యానికి మరియు ఆప్యాయతకు చిహ్నంగా, ఈ కార్యక్రమానికి హాజరైన రోగులందరికీ టొమాటో బాత్ పంపిణీ చేశారు. ఈ గొప్ప సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నందుకు నాయకులు బతిని గౌడ్ కుటుంబాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉన్న రోగులు, భక్తులతో ఆత్మీయంగా ముచ్చటించారు. మన సమాజాలకు సేవ చేస్తూ, వాటిని బలోపేతం చేసే సాంప్రదాయ పద్ధతులను పరిరక్షించాల్సిన ప్రాముఖ్యతను వారు నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా రామేశ్వర్ మిశ్రా, కొండారెడ్డి, శ్రీనివాస్ హాజరై కార్యక్రమానికి తమ మద్దతును అందించారు. ఈ విశిష్టమైన వార్షిక కార్యక్రమంపై కొనసాగుతున్న నమ్మకానికి, విశ్వాసానికి నిదర్శనంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
బుధవారం 10 జూన్ 2026



## టీ ఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్ సమీప డంపింగ్ యార్డ్‌పై ప్రభుత్వ దృష్టి

కుత్బుల్లాపూర్ జూన్ 9(వాయిస్ టుడే ): బాచుపల్లి పరిధిలోని సాయి నగర్, టీ ఎస్ డబ్ల్యు ఆర్ స్కూల్ అండ్ డిగ్రీ కాలేజ్ ఫర్ గర్ల్స్‌లి సమీపంలోలి ఏర్పడిన డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు మరియు విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టేట్, మైనారిటీ, బీసీ మరియు సంక్షేమ శాఖల మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదుపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత స్థలాన్ని సందర్శించి, పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రజారోగ్యం మరియు పరిసరాల పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా శుభ్రపరిచి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఆయన ఈ సందర్భంగా స్థానికులకు హామీ ఇచ్చారు.

ఈ పర్యటన సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టేట్, మైనారిటీ, బీసీ మరియు సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఇద్దరూ కలిసి డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడి పరిస్థితులు, దుర్గంధం, దోమల సమస్యతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య ఇబ్బందులపై చర్చించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థినులు మరియు పరిసర కాలనీల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అతి త్వరలోనే ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని హన్మంత్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరీ , వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారనే సందేశాన్ని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది.

## జూన్ 20న పదవ తరగతి ప్రతిభావంతులకు పురస్కారాల పంపిణీ

### 500 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ..

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే): ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 20వ తేదీన సైకిల్లు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడంతోపాటు.. పరీక్ష సామాగ్రి సైతం అందించడం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా.. ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం నగదు పురస్కారాలు పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## తమకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

నాంపల్లి : జూన్ 09 ( వాయిస్ టుడే): చర్లపల్లి ఘట్‌కేసర్ రైల్వే మార్గంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగిని విజయరెడ్డి అత్తమామలు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. చనిపోయిన తన కోడలు తల్లి , సోదరుడు నుండి తమకు తమ కుమారుడు సురేందర్ రెడ్డికి ప్రాణహాని ఉందంటూ బాధిత వృద్ధ దంపతులు భగవంత్ రెడ్డి , సులోచనలు మానవ హక్కుల కమిషన్ లో పిర్యాదు చేసారు. ఈ ఏడాది జనవరి 31న తమ కోడలు ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. తన కొడుకు కష్టపడి సంపాదించిన ఆస్తిపై తమ కోడలు తల్లి పుష్ప, అన్న చిరంజీవిల కన్నుపడిందన్నారు. తన కొడుకు ఇంట్లో ఉన్న బంగారు , వెండి ఆభరణాలతో పాటు కోటిన్నర నగదు, పలు ఇంటి స్థలాల డాక్యుమెంట్ లను ఎత్తుకెళ్లారని ఆరోపించారు. వాటిని అడిగితే స్థానిక రౌడీ షీటర్ దర్గా సుధాకర్ రెడ్డి అలియాస్ మున్ని పాహిల్వాన్ తో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వృద్ధులు అని చూడ కుండ రౌడీ షీటర్ దర్గా సుధాకర్ రెడ్డి తమను చంపుతానని బెదిరిస్తున్నారని తెలిపారు. తమకు రక్షణ కల్పించి... తన కొడుకు సంపాదించిన డబ్బు నగదు ఇప్పించేటట్లు పోలీసులను ఆదేశించాలని వారు కమిషన్ ను వేడుకున్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

### 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన పటాన్చెరు ఎం ఎల్ ఎస్ పాయింట్ వే బ్రిడ్జి ప్రారంభం..

### అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ లోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు..

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు (వాయిస్ టుడే): రేషన్ డీలర్ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. స్టాక్ పాయింట్లో ధాన్యం తూకం వేసే సమయంలో డీలర్లు నష్టపోవద్దన్న లక్ష్యంతో పటాన్చెరులోని ఎంఎల్ఎస్ పాయింట్ లో 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటుచేసిన వే బ్రిడ్జి ను మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. స్టాక్ పాయింట్లలో వే బ్రిడ్జి లేకపోవడం మూలంగా ధాన్యం ధూపం వేసే సమయంలో ప్రతిసారి నష్టపోతున్నామని గతంలో రేషన్ డీలర్లు తన దృష్టికి తీసుకునే రావడం జరిగిందని.. వెంటనే సొంత నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు చేయాల్సిన పని తాను చేయడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ స్టాక్ పాయింట్లలోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డీలర్లు కోరగా.. వచ్చే రెండు వారాల్లో బ్రిడ్జి ల ఏర్పాటునకు శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జి లు ఏర్పాటు చేసి రేషన్ డీలర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రేషన్ డీలర్ల సంక్షేమం కోసం 15 లక్షల రూపాయలు సొంత నిధులతో వే బ్రిడ్జి ఏర్పాటు చేసిన ఘనత. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కే దక్కిందని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ప్రశంసించారు. తమ సంక్షేమం ఆర్థిక అభ్యున్నత కోసం అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అనంతం, జిల్లా ఉపాధ్యక్షులు జయప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



## ఇస్నాపూర్ మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించండి : నీలం మధు ముదిరాజ్

### దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపించండి

### మంత్రి వివేక్‌కు ఘన స్వాగతం పలికి వినతి పత్రం ఇచ్చిన ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని ప్రత్యేకంగా పరిగణించి నిధులు కేటాయించాలి అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి ని ఇస్నాపూర్ చౌరస్తాలో కలసి ఘనస్వాగతం పలికి నిధులు, పలు సమస్యలపై ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన నీలం. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ పరిధిలో గల 329 కాలనీ, ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీ లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని ఆ కాలనీలో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కరెంట్ పోల్స్, త్రాగునీరు, ఇంటి నెంబర్లు మరియు కరెంట్ మీటర్లు, వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు, అలాగే నేషనల్ హైవే నుండి లక్డారం- బ్యాతోల్ - రుద్రారం - ఏర్థనూర్ వరకు రోడ్డు, ఇరు వైపులా ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయాలని మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన 15 కోట్ల నిధుల పనులు ఇప్పటికే ప్రారంభం అయినట్లు మంత్రి కి ఆయన వివరించారు అలాగే మరికొన్ని నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్టు ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నే రాఘవేందర్, వెంకటేష్ నాయక్, అల్లంగారి నర్సింహారెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, మణికంఠ, నాయకులు వల్లపు వెంకటేష్, మురళి, మహేష్, అనిల్, ప్రవీణ్, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో గోషామహల్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సభ విజయవంతం

### - తలసానిని సత్కారించిన ఆర్ వి మహేందర్ కుమార్



హైదరాబాద్, జూన్ 9(వాయిస్ టుడే): తెలంగాణ భవన్‌లో ఇటీవల నిర్వహించిన గోషామహల్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సభ పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషితో విజయవంతమైందని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్వీ మహేందర్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించి, గోషామహల్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు సభ విజయవంతం కావడానికి ప్రోత్సాహం అందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు కూడా ఆర్వీ మహేందర్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహాన్ని రాబోయే జిహెచ్ఎంసీ ఎన్నికల వరకు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. గోషామహల్‌లో సమిష్టిగా పని చేసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విజయవంతంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మీసాల క్రాంతి, బెజ్జిని శ్రీనివాస్, తెలంగాణ శేఖర్ చారి, సునీల్ సింగ్, తంపు, బాల్ ముకుంద్, విక్కీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




## గీతంలో 'తల్లి పేరిట మొక్క'

### మొక్కలు నాటిన గీతం ఉన్నతాధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు




పటాన్ చెరు (వాయిస్ టుడే): దేశవ్యాప్త 'తల్లి పేరిట ఒక మొక్క' (ఏక్ పేడ్ మా కే నామ్) చొరవలో భాగంగా, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ప్రచారం, పర్యావరణ సుస్థిరత, జీవావరణ స్పృహను ప్రోత్సహిస్తూ, తమ తల్లుల గౌరవార్థం ఒక మొక్కను నాటమని పౌరులను ప్రోత్సహిస్తోంది. విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు- (గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్) వివిధ గీతం స్కూళ్ల అధిపతులు, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చని, ఆరోగ్యకరమైన భవిష్యత్తును సృష్టించడం పట్ల గీతం యొక్క నిబద్ధతను ఈ చొరవ పునరుద్ఘాటించింది.

వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో, సుస్థిర జీవనాన్ని ప్రోత్సహించడంలో మొక్కలు నాటడం యొక్క ప్రాముఖ్యతను ఇందులో పాల్గొన్న ఉన్నతాధికారులు నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమం ప్రకృతి పట్ల శ్రద్ధ, పోషణ, బాధ్యత వంటి విలువలను ప్రతిబింబిస్తూ, తల్లులకు ఒక ప్రతీకాత్మక నివాళిగా కూడా నిలిచింది. మొక్కల పెంపకం కార్యక్రమం, సుస్థిరత, సామాజిక బాధ్యతను ప్రోత్సహించడానికి గీతం హైదరాబాదు చేస్తున్న నిరంతర ప్రయత్నాలకు ఒక నిదర్శనంగా నిలుస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణ, దేశ నిర్మాణానికి అర్థవంతంగా తోడ్పడేలా గీతం సిబ్బందిని ప్రేరేపిస్తోంది.

# రైతు బిడ్డలకు కనురెప్ప పాటు కరెంట్ పోకుండా సబ్ స్టేషన్లు, స్టోరేజ్ గోడౌన్స్ ఏర్పాటు

**– రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క**

**త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల 'ఇందిరమ్మ కుటుంబ భీమా'**

**భువనగిరిలో రూ.11 కోట్ల విద్యుత్ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం శంకుస్థాపన చేసిన.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):-టీజీ ఎస్పీడీసీఎల్ యాదాద్రి భువనగిరి జిల్లా సర్కిల్ పరిధిలో, భువనగిరి పట్టణంలోని ?5.83 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన సర్కిల్ కార్యాలయ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు.భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో ?2.67 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను కూడా ఈ సర్కిల్ కార్యాలయం నుంచే రిమోట్ ద్వారా ప్రారంభించారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల రైతులకు నాణ్యమైన విద్యుత్ అంది లబ్ధి చేకూరుతుందన్నారు.

భువనగిరి మండలం హనుమపురం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా ?2.03 కోట్లతో నిర్మించనున్న 'స్టోర్ కాంప్లెక్స్'కు, అలాగే వలిగొండ మండలం నర్సాపూర్ గ్రామంలో ?3.52 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.భువనగిరి సర్కిల్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రజల ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు. ?ఉచిత కరెంట్ ఇవ్వడమే కాదు, క్వాలిటీ పవర్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 18,546 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్ నమోదైనప్పటికీ, కనురెప్ప పాటు కూడా కరెంట్ పోకుండా నిరంతర విద్యుత్తును అందించి ఘనత సాధించిందని కొనియాడారు.

మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో పాటు వడ్డీ లేని రుణాల ఇచ్చామన్నారు. రాబోవు రోజుల్లో అత్యధిక వడ్డీ లేని రుణాలను రాష్ట్రంలోని మహిళలందరికీ అందిస్తామన్నారు .మహిళా సంఘాల ద్వారానే బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీలో తిప్పేలా విప్లవాత్మక నిర్ణయం ప్రజా ప్రభుత్వం తీసుకున్నదని వివరించారు. రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున రూ.50-55 విలువైన సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత ప్రజాపాలన ప్రజా ప్రభుత్వానిదే అని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ క్రమ పద్ధతిలో విడుదల చేస్తున్నామన్నారు. ఇకపై దళారీల ప్రమేయం లేకుండా ఈ నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాలకే జమ చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు లేని ప్రతి వారికి రూ.5 లక్షల చొప్పున అర్హులైన ప్రతి వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. ఈ ఏడాది కూడా ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇళ్లనుకేటాయించబోతున్నట్లు హామీ ఇచ్చారు.?కోటి 15 లక్షల కుటుంబాలకు 'ఇందిరమ్మ కుటుంబ భీమా'

దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు కులమతాలతీతంగా ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. 5 లక్షల ధీమా కల్పించేలా 'ఇందిరమ్మ కుటుంబ భీమా' పథకాన్ని త్వరలోనే ప్రారంభించబోతున్నామని తెలిపారు. బసవాపురం భూ నిర్వాసితుల సమస్యలను ప్రస్తావిస్తూ, వారికి పరిహారం త్వరగా అందేలా తక్షణ చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..భువనగిరి నియోజకవర్గ ప్రజలకు, రైతులకు కరెంట్ సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతనే నూతన 33/11 సబ్ స్టేషన్ లు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, ఇట్టి సబ్ స్టేషన్ లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 5 కోట్ల తోటి నూతన TGSPDCL సర్కిల్ ఆఫీస్ ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ స్టోరేజ్ గోడౌన్స్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్నందున భువనగిరి లోని స్టోరేజ్ మొత్తం నల్లగొండ స్టోరేజ్ లో చేయాల్సి ఉందన్నే విషయాన్ని గుర్తించి భువనగిరి నియోజకవర్గంలోనే నూతన స్టోర్స్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని అన్నారు.దాదాపు 8 సబ్ స్టేషన్ లు త్వరలో ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని , తదనుగుణంగా భువనగిరి లో నిరంతర విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదన్నారు. గత పాలనలో ఒక్క సబ్ స్టేషన్ కూడా మంజూరు చేయలేదని, ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 10 నూతన సబ్ స్టేషన్ లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... రైతులకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్లు అందించేలా చూడాలని అన్నారు. నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోవడం భువనగిరి నియోజకవర్గ ప్రజలకు ఒక గొప్ప వరం అని అన్నారు. నూతన సబ్ స్టేషన్ ల ద్వారా విద్యుత్ అంతరాయం ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ ఐ.ఏ.ఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్,తడక వెంకటేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, ఇతర ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలి

**- భువనగిరి ఎంపీ. చామల కిరణ్ కుమార్ రెడ్డికి**



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):- సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ చేరేలా జిల్లా అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పలువురు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ చామల కిరణ్ రెడ్డి కి వివిధ శాఖల అధికారులు నివేదికలు వారి పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నందున సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరాలని, అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు పెద్ద ఎత్తున ప్రచారం చేసి అవగాహన కల్పించి ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయా శాఖల్లో అభివృద్ధి పనులకు మంజూరైన నిధులు సద్వినియోగం అయ్యేలా సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్స్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ , వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా



పటాన్ చెరు (వాయిస్ టుడే): సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయం మాదాపూర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేసి కమిషనర్‌కి మెమోరం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు మాట్లాడుతూ హైదరాబాదుకు వెన్నెముకగా ఉన్న సైబరాబాద్ మున్సిపల్ కార్యాలయం కు ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్నదని అన్నారు. కానీ అమీన్పూర్, పటాన్చెరు, శేర్లింగంపల్లి సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల జీతాలను పెంచడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు అని అన్నారు. ప్రస్తుతం మున్సిపల్ లో ఉన్న కాలం నాటి 16,600 జీతాలు మాత్రమే చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. 2025 డిసెంబర్లో జిహెచ్ఎంసి లో విలీనమైనా, జిహెచ్ఎంసి వేతనాలను మాత్రమే సిఎంసి లో పనిచేస్తున్న ప్రస్తుత కార్మికులకు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఏడు నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో కార్మికులకు పెంచిన జీతాలు చెల్లించడం లేదని అన్నారు. బొల్లారం, తెల్లాపూర్, రామచంద్రాపూర్, బీరంగూడ ముత్తంగి, భారతి నగర్ అన్ని డివిజన్లో కలిపి 1500 మంది కార్మికులు ఉన్నారని గుర్తు చేశారు. వీరందరికీ సిఎంసి కార్మికులకు ఇచ్చే యూనిఫాంలో నేటికీ ఇవ్వడం లేదని అన్నారు, ఈ ఎస్ ఐ, పి ఎఫ్ కనీస సౌకర్యాల విషయంలో సంబంధిత జోనల్ అధికారులు పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. జోనల్ కమిషనర్ శేర్లింగంపల్లి కి అనేక సందర్భాలలో విన్నవించడం జరిగిందని అన్నారు. గత రెండు నెలలుగా 25 26వ తేదీలలో జీతాలు చెల్లించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎన్ని సందర్భాలలో విన్నవించిన అధికారుల పనితీరులో మాత్రం మార్పు రావడంలేదని అన్నారు. పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లో పనుల విషయంలో సంబంధిత అధికారులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని అన్నారు. వందల కోట్ల రూపాయల ఆదాయం ఉన్న సైబరాబాద్ మునిసిపల్ ప్రాంతంలో కార్మికులకు ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అనేకమంది కార్మికులు విధుల నిర్వహణ, ప్రమాదాల్లో మరణిస్తున్న వారికి ఎలాంటి ఇన్సూరెన్స్ కల్పించడం లేదని అన్నారు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ప్రతీ కార్మికునికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సైబరాబాద్ అధికారులను హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమీన్పూర్, పటాన్చెరు సర్కిల్స్ నుంచి కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొంగరి కృష్ణ, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హెచ్.ఎల్ టౌన్షిప్‌లో నీటి సమస్యపై స్పందన

**– కోలన్ హనుమంత్ రెడ్డిని కలిసిన హెచ్.ఎ.ఎల్ యూనియన్ నాయకులు**

కూకట్ పల్లి : జూన్ 9(వాయిస్ టుడే): బాలానగర్ డివిజన్ పరిధిలోని హెచ్.ఎల్ టౌన్షిప్‌లో గత కొన్ని రోజులుగా తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొని కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, ట్రైనీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, కూకట్పల్లి నియోజకవర్గం ఐఎన్‌టీయూసీ నాయకుడు కర్కనాగరాజు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కార్మిక నాయకుడు కోలన్ హనుమంత్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హెచ్.ఎల్ టౌన్షిప్‌లో నెలకొన్న నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వెంటనే స్పందించిన కోలన్ హనుమంత్ రెడ్డి వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి కి ఫోన్ ద్వారా సమస్యను వివరించి, హెచ్.ఎల్ టౌన్షిప్‌కు తగినంత నీటి సరఫరా పెంచి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన కోలన్ హనుమంత్ రెడ్డికి యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యూనియన్ ప్రతినిధులు వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ మాధవి గారిని కలిసి సమస్యను వివరించగా, త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కుతాడి కృష్ణ, జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలేపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## నిందితుడిని బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలి

**నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్**

ఖమ్మం ,జూన్ 09.( వాయిస్ టుడే): ఖమ్మం రాపర్తి నగర్‌లోని జీ ఫ్రైడ్ అపార్ట్‌మెంట్‌లో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ అత్యాచారం, హత్యాయత్నం ఘటనను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు పరామర్శించారు. ఈ హృదయ విదారక ఘటనపై ఆయన తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లో రెండో అంతస్తులో నివాసం ఉంటున్న 42 ఏళ్ల మహ్మద్ గౌస్ పాషా అనే మృగాడు 12 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక ప్రతిఘటించడంతో కిరాతకంగా అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకు తోసేశాడని, దీంతో ఆ పసిపాప రెండు చేతులు, వెన్నెముక విరిగిపోయి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన నిందితుడిపై పోలీసులు కేవలం పోక్సో కేసు మాత్రమే నమోదు చేసి, అతనికి రక్షణ కల్పిస్తున్నారని కోటేశ్వరరావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఇలాంటి మృగాలకు, మూర్ఖులకు చట్టపరమైన సాధారణ శిక్షలు ఏమాత్రం సరిపోవని, నిందితుడిని తక్షణమే బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్ లాంటి కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి అకృత్యాలకు పాల్పడేవారి వెన్నులో వణుకు పుడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆ చిన్నారికి మెరుగైన, అత్యవసర వైద్యం అందించడం కోసం తక్షణమే ఆమెను హైదరాబాద్‌కు తరలించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి బీజేపీ సంపూర్ణ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో హిందూ మైనర్ బాలికలకు రక్షణ కరువైందని కోటేశ్వరరావు మండిపడ్డారు. పథకం ప్రకారం లవ్ జిహాద్ పేరుతో ట్రాప్ చేయడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు జిల్లాలో సర్వసాధారణంగా మారిపోయాయని ఆయన ఆరోపించారు. గతంలో బోనకల్లు, అలాగే ఓ మదర్సా సమీపంలో జరిగిన ఇలాంటి దారుణాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయా ఘటనల్లో దోషులకు సరైన శిక్షలు పడకపోవడం, కేసులను కప్పిపుచ్చే ప్రయత్నాలు జరగడం వల్లే నేరస్థులు రెచ్చిపోతున్నారని విమర్శించారు.

## ఖమ్మం ఘటనపై మాజీ ఎంపీ నామ ఆగ్రహం

**నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్**



ఖమ్మం, జూన్ 9 ( వాయిస్ టుడే ): ఖమ్మంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటనపై బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం చేసి భవనం పై నుంచి తోసేయడం అమానుషమని ఖండించారు. చిన్నారులపై ఇలాంటి పైశాచిక దాడులు సభ్యసమాజం తలదించుకునేలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపించి అత్యంత కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నేరస్తుల గుండెల్లో భయం పుట్టేలా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
బుధవారం 10 జూన్ 2026

# ఆయిల్ పామ్ నర్సరీల్లో భారీ అవకతవకలు

## కూలీలకు సరైన వేతనాలు చెల్లించడం లేదు

## జిల్లా కలెక్టర్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్



తొర్రూరు, జూన్ 9 వాయిస్ టుడే : తొర్రూరు మండలంలోని హరిపిరాల, గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీలను మంగళవారం సందర్శించిన మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఆయిల్ ఫామ్ మొక్కలను అందించాల్సిన నర్సరీల్లో పలు అవకతవకలు జరుగుతున్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ నర్సరీల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. హరిపిరాల నర్సరీలో నాసిరకం విత్తనాలు, నాసిరకం వర్మి కంపోస్ట్, నాసిరకం మట్టి, నాసిరకం ఎరువులు వినియోగించడం వల్ల వేలాది మొక్కలు దెబ్బతింటున్నాయని ఆయన అన్నారు. రైతులకు సరైన సమయంలో మొక్కలు అందకపోవడంతో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సరీలో మూడు షెడ్లు ఉండగా మొత్తం 24 మంది కూలీలు పనిచేయాల్సి ఉండగా కేవలం 11 మందితోనే పనులు నిర్వహిస్తున్నారని, దీంతో మొక్కల సంరక్షణ సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. కూలీల సంఖ్య తగ్గించి, నాసిరకం సామగ్రి వినియోగించడం ద్వారా ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. గ్రేడ్-1లో పెంచిన మొక్కలను నాలుగు నెలల తర్వాత బయటకు తీసి పెంచాల్సి ఉండగా ఏడు నెలలు గడిచినా వాటిని తరలించకపోవడం వల్ల మొక్కలు బలహీనపడుతున్నాయని తెలిపారు. తగినంత నీటి సౌకర్యం లేకపోవడం, ఎరువుల నిర్వహణలో లోపాలు ఉండటంతో మొక్కలు ఎరుపెక్కి ఎండిపోతున్నాయని, దాదాపు 40 శాతం వరకు మొక్కలు నష్టపోయినట్లు తెలుస్తోందన్నారు.

2026 జనవరిలో నాటిన 60 వేల స్ప్రింగ్ వెరైటీ విత్తనాల్లో కేవలం 30 వేల విత్తనాలు మాత్రమే మొలకెత్తడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ స్థాయిలో విత్తనాలు చనిపోవడానికి గల కారణాలను అధికారులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ములుగు జిల్లా మల్లంపల్లి ప్రాంతం నుంచి తీసుకురావాల్సిన ఎర్రమట్టికి బదులుగా ఇతర ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తూ అక్రమ బిల్లులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై సమగ్ర విచారణ అవసరమని తెలిపారు. గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదని మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. రూ.200 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు రైతులకు ఎంతో మేలు చేయాల్సి ఉండగా ప్రస్తుతం నిర్వహణలో పలు లోపాలు కనిపిస్తున్నాయని చెప్పారు. 2022 నుంచి వేలాది మంది రైతులకు మొక్కలు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ప్రస్తుతం నర్సరీలో ఉండాల్సిన మొక్కల సంఖ్య కనిపించడం లేదని పేర్కొన్నారు.

థాయ్‌లాండ్, కోస్టారికా దేశాల నుంచి దిగుమతి చేసిన విత్తనాల్లో సుమారు 40 శాతం వరకు మొలకెత్తకపోవడం వెనుక ఉన్న కారణాలపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. నాసిరకం విత్తనాలు, నాసిరకం మట్టి, నాసిరకం ఎరువుల కారణంగా నర్సరీల పనితీరు దెబ్బతింటోందని ఆరోపించారు. నర్సరీల్లో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాలు చెల్లించాలని, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా చూడాలని కోరారు. కూలీల వేతనాల్లో కూడా అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వస్తున్నందున వాటిపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్, సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హరిపిరాల, గోపాలగిరి ఆయిల్ ఫామ్ నర్సరీల్లో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందించి ఆయిల్ ఫామ్ సాగుపై విశ్వాసం పెంచేలా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## బస్సుల ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలని వినతి పత్రం

ఖమ్మం, జూన్ 9( వాయిస్ టుడే ): జిల్లాలో నడుస్తున్న స్కూల్ బస్సులు మరియు ప్రైవేట్ బస్సులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్న వాహనాలకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని, వై విక్రమ్, ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్ టి ఓ కార్యాలయంలో జిల్లా రవాణా శాఖ అధికారి జేఎన్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో విద్యార్థులు మరియు సాధారణ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. వాహనాల బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్, బీమా పత్రాలు, అనుమతులు, ఇతర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాహనాలకు మాత్రమే ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి అని కోరారు.



## జర్నలిస్టుల పిల్లల ఫీజు రాయితీపై మంత్రి పొంగులేటి హామీ

ఖమ్మం, జూన్ 9 ( వాయిస్ టుడే ): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ - హెచ్ - 2843) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సానుకూలంగా స్పందించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 50 % ఫీజు రాయితీ కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. దీనిపై స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్, డీఈవోలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రాన్ని కలెక్టర్ కు పంపాల్సిందిగా తన వ్యక్తిగత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారని, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని టీడబ్ల్యూజేఎఫ్ వినతిపత్రంలో పేర్కొంది. అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు కాబట్టి వారిని అవకాశం ఉన్న మేరకు ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నదని జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు సామాన్యునికి అందుబాటులో లేవని అన్నారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులు తమ పిల్లలను చదివించుకోవటం భారం అవుతోందని పేర్కొన్నారు . ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో సెక్షన్ కు నలుగురు చొప్పున పేద విద్యార్థులకు ఉచిత బోధనాభ్యాస అవకాశం కల్పించాలనే నిబంధన ఉన్నా ఏ ఒక్కచోటా ఇదీ సక్రమంగా అమలు అవుతున్న దాఖలాలు లేవన్నారు. పేద, మధ్యతరగతి వర్గానికి చెందిన జర్నలిస్టుల పిల్లల విషయంలోనైనా ఇదీ అమలయ్యేలా చూడాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రతీ ప్రైవేటు, కార్పొరేటు పాఠశాల, కళాశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చేలా... సమాచార శాఖ మంత్రిగా ప్రభుత్వం తరపున ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరడంతో ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రభుత్వం నుంచి తగు ఆదేశాలు జారీ చేయిస్తానని మంత్రి స్పష్టతనిచ్చారు.



## కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం

తొర్రూరు, జూన్ 9 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న వేల మంది కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పేర్కొంటూ కరపత్రాన్ని మంగళవారం తొర్రూర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద విడుదల చేశారు. అనంతరం రవి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోలో గ్రామపంచాయతీ కార్మికులను ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఈ నిర్లక్ష్యానికి నిరసనగా కొద్ది జీతం పని బారెడు అన్న చందంగా కార్మికుల పరిస్థితి మారిందన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం కనీస వేతనాలను గ్రామపంచాయతీ కార్మికులకుఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గ్రామపంచాయతీ కార్మికులకు ఎందుకు ఇవ్వటం లేదని అన్నారు. ప్రభుత్వాల ఈ నిర్లక్ష్యాన్ని పంచాయతీ కార్మికులతో పాటు ఇతర రంగాల కార్మికులు కూడా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భాగంగా ఈనెల 13 వరకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సర్పంచ్లకు 13న ఎంపీడీవోలకు 22న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. టీయూసీఐ తోరూర్ ఏరియా అధ్యక్షుడు శ్రీరామ్ పుల్లయ్య, జిపి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడియా బీకు, రాష్ట్ర నాయకులు గాదరబోయిన సంతోష్ , మండల అధ్యక్షుడు గుండాల సోమ నరసయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు అండగా పార్టీ, తాను ఉంటాం

### బీఆర్ఎస్ బలోపేతానికి బూత్ స్థాయి నుంచి కార్యాచరణ

### మాజీ ఛీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, వాయిస్ టుడే: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని,పార్టీతో పాటు తాను కూడా కార్యకర్తలను కాపాడుకుంటానని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 58,59,60 డివిజన్ల బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం మంగళవారం వడ్డేపల్లి టీఎన్జీవోస్ కాలనీ లో గల ఎన్వీ కన్వెన్షన్‌లో నిర్వహించగా వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత కేసీఆర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనల మేరకు డివిజన్ల వారీగా బూత్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

బూత్ స్థాయిలో ఓటర్ల గుర్తింపు,మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతూ ఎస్ఐఆర్‌పై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని పేర్కొంటూ మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు ఇమ్మడి లోహిత,కేశబోయిన అరుణ,మిడిదొడ్డి స్వప్న,పలువురు డివిజన్ ఇన్‌చార్జులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్య, ఉపాధ్యాయరంగ సమస్యల పరిష్కారమే ఎస్టియూ లక్ష్యం

### - ఎస్టియూ జిల్లా కార్యదర్శి కొరవి సుధాకరా చారి

తొర్రూర్ జూన్ 9 (వాయిస్ టుడే) : విద్య ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్టియు టీఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని ఆ సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కొరవి సుధాకరా చారి అన్నారు. ఎస్టియూ 80వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలో ఎస్టియూ జెండా ఆవిష్కరించి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎస్టీయూలోని సీనియర్ కార్యకర్తలను శాలువాల కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకరాచారి మాట్లాడుతూ ఎస్టీయూ 80 సంవత్సరాల ప్రస్తావనాన్ని పూర్తి చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఈ సంఘం 1947లో స్థాపించబడిందని, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు విద్యాభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అంశాలపై అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. విద్యారంగంలో వచ్చిన అనేక మార్పులు, సంస్కరణలో ఎస్టియు కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఉద్యోగులకు 317 జీవో తో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ లో రద్దు చేసి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలు, డిఏలు ప్రభుత్వం నేటికీ విడుదల చేయకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సిని ప్రకటించి ఉద్యోగులకు మెరుగైన పిఆర్సిని అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఎస్ టి యూ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్ఎం విజయ్ కుమార్, చంద్రప్రకాష్,డి. చంద్రమౌళి, గుంటుక శ్రీనివాస్, హరికృష్ణ చారి,ఎస్టియూ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ యం పి రామ సహాయం సురేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తూర్పు కాంగ్రెస్ నాయకులు



వరంగల్ ( వాయిస్ టుడే ) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వరంగల్ మాజీ ఎంపీ రామ సహాయం సురేందర్ రెడ్డి మంగళవారం హన్మకొండకు రావడం జరిగింది. ఈ సందర్భంగా అయన ను వరంగల్ తూర్పు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీ. పి సి. సి. డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, మాజీ కార్పొరేటర్ బస్వరాజు శిరీష - శ్రీమాన్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రామ సహాయం సుందర్ రెడ్డి వరంగల్ లో పార్టీ పరిస్థితిని తెలుసుకుని, రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహ్యాలను వరంగల్ తూర్పు నాయకులకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత విస్తరింప చేయాలని ఈ సందర్బంగా సూచించారు, ఈ కార్యక్రమం లో వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు



## కాజీపేటలో తృటిలో తప్పిన పెనుప్రమాదం

### మద్యం మత్తులో కల్వర్టును ఢీకొట్టిన కారు.. ఒకరికి తీవ్ర గాయాలు

### కేసు నమోదు చేసిన మడికొండ పోలీసులు

కాజీపేట, (వాయిస్ టుడే) : కాజీపేటలో మంగళవారం సాయంత్రం తృటిలో పెనుప్రమాదం తప్పింది. మద్యం మత్తులో ఉన్న యువకులు ప్రయాణిస్తున్న స్కోడా కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో నలుగురు యువకులు గాయపడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దర్గా కాజీపేట నుంచి కాజీపేట వైపు వెళ్తున్న స్కోడా కారు వేగంగా వెళ్తుండగా మద్యం మత్తులో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కడిపికొండలోని రాజీవ్ గృహ వద్ద రహదారి పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు యువకులు స్వల్ప గాయాలతో బయటపడగా,మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఘటనలో కారు ఎడమవైపు భాగం తీవ్రంగా డ్యామేజ్ అయ్యింది. ఒక్కసారిగా భారీ శబ్ధం రావడంతో గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం. ఒకవేళ కారులోని డీజిల్ ట్యాంక్ వైపుభాగం కల్వర్టు వైపు బలంగా ఢీకొట్టి ఉంటే ఒక్కసారిగా మంటలు చెలరేగి కారులో ఉన్న వారంత సజీవ దహనం అయ్యేవారు అని,అలాంటి ఘటనలు చాలా చోట్ల జరిగాయని పలువురు పలుచోట్ల జరిగిన ఘటనలు గుర్తుచేసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న మడికొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

వాయిస్
హైదరాబాద్
బుధవారం 10 జూన్ 2026

# ఎన్నికలు జరగని నాలుగు పంచాయతీలకు రూ.17 లక్షల తాగునీటి నిధులు

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎంపీ రఘురాం రెడ్డి చొరవతో మంజూరు**

**నాచారం గ్రామానికి నిధుల సాధనలో ఒక్కంతుల సోదరులు నాగార్జున, సాగర్ ప్రత్యేక కృషి**



ఏన్కూర్ : ఏన్కూరు మండలంలోని ఎన్నికలు జరగని అరికాయలపాడు, ఏన్కూరు, జన్నారం, నాచారం గ్రామపంచాయతీలలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.17 లక్షల నిధులు మంజూరయ్యాయి. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) -- ఎస్ఎస్‌బీఎం(జీ) పథకం కింద ఈ నిధులను ఖమ్మం జిల్లా కలెక్టర్ పరిపాలనా అనుమతులతో విడుదల చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మొత్తం ఏడు అత్యవసర పనులకు ఆమోదం లభించింది.

ఎన్నికల ప్రక్రియ పూర్తికాని గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు తాగునీటి సమస్యలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధుల కేటాయింపునకు కృషి చేయడంతో ఈ నిధులు మంజూరైనట్లు స్థానిక నాయకులు తెలిపారు. మంజూరైన నిధులతో అరికాయలపాడు గ్రామపంచాయతీలో హ్యాండ్‌పంప్ సామగ్రి సరఫరా కోసం రూ.1 లక్ష, కొత్త బోర్‌వెల్ ఏర్పాటు కోసం రూ.5 లక్షలు కేటాయించారు. ఏన్కూరు గ్రామపంచాయతీలో హ్యాండ్‌పంప్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు, సరఫరా కోసం రూ.1.50 లక్షలు మంజూరు చేశారు.

అలాగే జన్నారం గ్రామపంచాయతీలో కొత్త బోర్‌వెల్ ఏర్పాటు కోసం రూ.2 లక్షలు, హ్యాండ్‌పంప్ సామగ్రి సరఫరా కోసం రూ.1.50 లక్షలు కేటాయించారు. నాచారం కాలనీలో బోర్‌వెల్ ఏర్పాటు కోసం రూ.5 లక్షలు, నాచారం గ్రామపంచాయతీలో హ్యాండ్‌పంప్ సామగ్రి కొనుగోలు కోసం రూ.1 లక్ష మంజూరు చేశారు. మొత్తంగా నాలుగు గ్రామపంచాయతీల పరిధిలో ఏడు తాగునీటి పనులకు రూ.17 లక్షల నిధులు కేటాయించడం ద్వారా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. ముఖ్యంగా నాచారం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ గ్రామ నాయకులు, ఒక్కంతుల సోదరులు నాగార్జున, సాగర్ నిరంతరం కృషి చేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎంపీ రఘురాం రెడ్డి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి నిధుల మంజూరుకు కృషి చేశారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే నాచారం గ్రామానికి బోర్‌వెల్, హ్యాండ్‌పంప్ పనులకు నిధులు మంజూరయ్యాయని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్ మాట్లాడుతూ ఎన్నికలు జరగని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను గుర్తించి ప్రత్యేక నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎంపీ రఘురాం రెడ్డికి మండల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఏఎంసీ చైర్మన్ లచ్చిరాం, మాజీ ఎంపీటీసీ మేడా ధర్మారావు, ఒక్కంతుల సాగర్, సర్పంచ్‌లు సురేష్, నిమ్మల నాగేశ్వరరావు, భువనేశ్వర్ రాజు, దుందుకూరి భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు కావడం సంతోషకరమన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమై ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంజూరైన పనులను శాఖా నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఎంబీ ఇంట్రా డివిజన్ అధికారులకు సూచనలు జారీ చేశారు. పనులు పూర్తయిన అనంతరం అరికాయలపాడు, ఏన్కూరు, జన్నారం, నాచారం గ్రామాల్లో తాగునీటి కొరత గణనీయంగా తగ్గి ప్రజలకు శాశ్వత ఉపశమనం లభించనుందని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు కొనసాగుతాయని స్థానిక నాయకులు తెలిపారు.



## ఎస్ పి ఎఫ్ ఆధ్వర్యంలో హరితహారం

నాగార్జునసాగర్, జూన్, 9: వాయిస్ టుడే: నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ లో మంగళవారం నాగార్జునసాగర్ యూనిట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ పి ఎఫ్ నాగార్జునసాగర్ యూనిట్ అసిస్టెంట్ కమాండెంట్ బి రాజు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్- 99 కార్యక్రమంలో భాగంగా ఎస్ పి ఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా, జోన్ డిఐజి మాధవరావు ఆదేశాల మేరకు నాగార్జున సాగర్లోని ఎస్ పి ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయం, ఇన్స్పెక్టర్ కార్యాలయం పరిధిలో పలు మొక్కలు నాటి హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా తెలిపారు. ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటి దానిని సంరక్షించుకునే బాధ్యత చేపడితే పర్యావరణ పరిరక్షణతో పాటు, జీవన మనుగడకు సహకారం అందించిన వారు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్ఐలు రఘు, వెంకటేశ్వర్లు, ఏ ఎస్ ఐ లు పుల్లయ్య, రవీందర్,యూసుఫ్ లు జెన్కో,సాగర్ డ్యాం ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ భయం పట్టుకుంది: రావుల రాంనాథ్


నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 09: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీజేపీ భయం పట్టుకుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆరోపించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ పార్టీని, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమై కేంద్ర ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదని అన్నారు. రైతుల పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన అనంతరం కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుందని, తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు చేయబోమని కేంద్రం ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యానికి కేంద్రాన్ని బాధ్యులను చేయడం తగదని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన "రైతు గోస -- బీజేపీ భరోసా యాత్ర" ప్రభావంతోనే అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేశారని అన్నారు. ప్రజా సమస్యలపై మహేశ్వర్ రెడ్డి నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో బీజేపీ కీలక పాత్ర పోషించిందని, రాష్ట్రం ఎవరి జాగీరు కాదని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో బీజేపీపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఫామ్‌హౌస్‌కే పరిమితం చేసినట్లే, రాబోయే ఎన్నికల్లో సీఎం అనుముల రేవంత్ రెడ్డిని కొడంగల్‌కే పరిమితం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, నాయకులు ముత్యం రెడ్డి, రాచకొండ సాగర్, పొన్నం నారాయణ గౌడ్, జుట్టు దినేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ఝరాసంగం ఫ్రెండ్స్ సీసీకి ట్రోఫీ.. ఘనంగా విజయోత్సవాలు

ఝరాసంగం జూన్ 09 (వాయిస్ టుడే): జహీరాబాద్‌లోని శ్రీ ఎం. బాగారెడ్డి మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఝరాసంగం ఫ్రెండ్స్ సీసీ జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. ఆదివారం రాత్రి జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో యంగ్ స్టార్ సీసీ జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. జట్టు విజయం సందర్భంగా సోమవారం రాత్రి ఝరాసంగం ప్రధాన చౌరస్తాలో యువకులు, క్రీడాకారులు ఘనంగా విజయోత్సవాలు నిర్వహించారు. బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్ పాటిల్, షేక్ రహూఫ్ అహ్మద్ పాల్గొని జట్టు సభ్యులు, క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాభిమానులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా కాల్వ శ్రీనివాసరావు



హుజూర్ నగర్: జూన్ 09 (వాయిస్ టుడే ప్రతినిధి): హుజూర్ నగర్ లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా స్థానిక సీనియర్ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావును నియమిస్తూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారద మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఆమె ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా నియమించబడిన కాల్వ శ్రీనివాసరావు 3 సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. స్థానిక న్యాయమూర్తి ఆదేశాల మేరకు స్వతహాగా న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని ముద్దాయిల తరఫున కాల్వ శ్రీనివాసరావు వాదించవలసి ఉంటుంది. కాగా ఉచిత న్యాయ సహాయ న్యాయవాదిగా నియామకం కావడానికి తనకు పూర్తిగా సహకరించిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రాంరెడ్డి హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాసరావు లకు ఉచిత న్యాయ సహాయ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు శ్రీనివాసరావును అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



## ఎం సి హెచ్ హాస్పిటల్ వర్కర్లు ఎ ఐ టి యు సి నుండి సిఐటియులో చేరిక

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్ 09: ఎం సి హెచ్(జడ్జికన్) హాస్పిటల్ హాస్పిటల్‌లో సమావేశ నిర్వహించిన సందర్భంగా హాస్పిటల్ వర్కర్స్ పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎ ఐ టి యు సి నుండి సి ఐ టి యులో చేరడం జరిగింది. ఈ సందర్భంగా లిబొమ్మెనసురేష్ సి ఐ టి యు జిల్లా కార్యదర్శిలి మాట్లాడుతూ, కాంట్రాక్టర్ హాస్పిటల్ వర్కర్లకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అదిలాబాద్ రిమ్స్ లో 12093 నెల వేతనం చెల్లిస్తున్నారు, పి ఫ్3023 జమ చేస్తున్నారు, ఈ స్ ఐ 484 చెల్లిస్తున్నారు. కాని నిర్మల్ జడ్జికాన్ హాస్పిటల్ లో కార్మికుల కోత విధించడం జరుగుతుంది. నెల జీతం 11000, పి ఫ్ 1384, జమ చేస్తున్నారు.జంఐ 65 చెల్లిస్తున్నారు. కార్మికులను దోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్లను రద్దు చేయాలని సిఐటియు డిమాండ్. జీవో నెంబర్ 60 ప్రకారం 16600 కార్మికులకు బేసిక్ శాలరీ చెల్లించాలి.నరేంద్ర మోడీ తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి, కాంగ్రెస్ ప్రభుత్వము కనీస వేతనము నెలకు 18,000 రూపాయలు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలి, కనీస వేతనం 26 రూపాయలు సుప్రీంకోర్టు గైలెన్స్ ప్రకారం పెంచాలి.కనీస వేతనాల చట్టాన్ని సవరించి కార్మికులకు జీతం పెంచాలి. లేదా 30% పిఆర్సినా ప్రకటించాలి. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

పోచ్చన్న హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)అదిలాబాద్ రిమ్స్ యూనియన్ నాయకులులి మాట్లాడుతూ.. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక చట్టాల ప్రకారం కల్పించాల్సిన సౌకర్యాలు సక్రమంగా అమలు కావడం లేదని, ఉద్యోగ భద్రత కూడా లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సి ఐ టి యుఆధ్వర్యంలో పోరాటం చేయాలని నిర్ణయించుకొని సంఘంలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సి ఐ టి యు నాయకులు మాట్లాడుతూ హాస్పిటల్ వర్కర్లకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, సెలవులు తదితర చట్టబద్ధ హక్కులను అమలు చేయాలని యాజమాన్యం మరియు కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేసి, కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సి ఐ టి యు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు.

## నీటి పొదుపే రేపటి మనబిభవిష్యత్తు
### వేముల పుష్పక్క



మాడుగులపల్లి జూన్ 09 (వాయిస్ టుడే): మాడుగుల పల్లి మండలంలోని తోపుచర్ల, బొమ్మకల్ గ్రామపంచాయతీలలో (జె ఎస్ జె బి ) జల సంచాయి- జన్ భాగిదారి ప్రజలలో నీటిని పొదుపు చేసే కార్యక్రమం వివరించుటకు ఎంపీడీవో జి. వంశీధర్ ప్రజలలో అవేర్నెస్ తీసుకుని వచ్చుటకు కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది. జల సంచాయి- జన్ భాగిదారి కార్యక్రమంలో నీటి నిలువలు ఏ విధంగా అభివృద్ధి చేసుకోవాలి, పర్యావరణాన్ని ఏ విధంగా కాపాడాలి, చెట్లను పెంచి పర్యావరణాన్ని ఏ విధంగా సంరక్షించాలి,పొదుపు సంఘాల మహిళలు డబ్బులు పొదుపు చేసినట్లు ప్రతి కుటుంబ సభ్యులు నీళ్లను తమ యొక్క ఇంటి పరిసరాలలో పొదుపు చెయ్యాలని మరియు ""భూమిని నీటిని బ్రతకనిద్దాం -భావితరాలకు బ్రతుకునిద్దాం" అనే నినాదంతో గ్రామపంచాయతీలలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించాలని పొదుపు చేయాలని, పొలంలో ప పర్యావరణాన్ని కాపాడాలని,భావితరాలకు భవిష్యత్తు అందించాలని చెప్పటం జరిగింది, ఈ కార్యక్రమంలో తోపుచర్ల సర్పంచ్ పర్వతమ్మ, బొమ్మకల్ సర్పంచ్ బొమ్మ కంటే కల్పన ఈసీ బాలు నాయక్, ప్లాంటేషన్ సూపర్వైజర్ మీస్కిన్, టెక్నికల్ అసిస్టెంట్లు, యాదగిరి, సత్యనారాయణ , పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కళా సారధి కళాకారుల బృందం వేముల పుష్పక్క టీం హాజరు కావడం జరిగింది

## చోరికి గురైన 108 సెల్ ఫోన్ల రికవరీ

**పన్నెండు లక్షల తొంభై ఆరువేల రూపాయల విలువ గల ఫోన్లను బాధితులకు అందజేత**

**ఇప్పటి వరకు రెండు కోట్ల డెబ్భై లక్షల రూపాయల విలువ గల ఫోన్లను బాధితులకు అప్పగించిన నిర్మల్ పోలీసులు**

**సెకండ్ హ్యాండ్ మొబైల్స్‌లో చోరీ ముఠాలను గుర్తించాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశం**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే జూన్09: నిర్మల్ లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌లి ఆదేశను సారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సి ఈ ఐ ర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి లి108లి మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సి ఈ ఐ ర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరి గురైన లి108లి మొబైల్ ఫోన్లు లి(పన్నెండు లక్షల తొంభై ఆరువేల రూపాయల విలువ గల ఫోన్లను)లి స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ... మొబైల్ వినియోగదారులతో మాట్లాడుతూ మొబైల్స్ ఎలా పోగొట్టుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు.కావున వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి సి ఈ ఐ ర్ వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.సి ఈ ఐ ర్ వెబ్సైట్లో వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్ ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. ఈ సందర్భంగా మొబైల్ పోగొట్టుకున్న వినియోగ దారులు, ఫోన్ దొరికినందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్‌లి కు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా లి2250లి ఫోన్లు లి(సుమారుగా రెండు కోట్ల డెబ్భై లక్షల రూపాయల రూపాయల విలువ గల ఫోన్లను)లి రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు.

సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు.వినియోగ దారులు,లిసెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనేటప్పుడు అవి ఎక్కడి నుండి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతేకాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని పోలీసు అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు.

సిఇఐ ర్ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు.ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ సిబ్బందిని లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్‌లి అభినందించారు. ఈ మొబైల్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**